
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 14 జూన్ 2025



నా శివుడి అనుమతి లేనిదే..

» అలరించిన బాలకృష్ణ అఖండ-2 డైలాగ్

» సంయుక్త మీననేతో కలిసి ఏలూరులో సందడి..

ఏలూరు రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి):'నా శివుడు అనుమతి లేనిదే ఆ యముడు కూడా కన్నెత్తి చూడడు. నువ్వు చూస్తావా.. అమాయకుల ప్రాణాలు తీస్తావా..' అంటూ బాలకృష్ణ తాను నటించిన అఖండ-2 సినిమా డైలాగ్‌ను పలికి అభిమానులను అలరించారు. ఈ టీజర్ విడుదలైన 26 నిమిషాల్లోనే మూడు లక్షల మందికి పైగా ప్రజలు వీక్షించి రికార్డు సృష్టించారని అన్నారు. సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శుక్రవారం ఏలూరులో సందడి చేశారు. కొత్త బస్టాండ్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన వేగ జ్యువెలర్స్ షోరూమ్‌ను సినీ నటి సంయుక్త మీననేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారికి బాలకృష్ణ అభిమానులు, తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అభిమానులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఏలూరుతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. మా బంధువులు పెదపాడు మండలం నాయుడుగూడెంలో ఉన్నారు. అలాగే నన్ను చూసేందుకు వచ్చిన మీరంతా నా బంధువులే. ఎన్టీఆర్ కడుపున పుట్టడం నా అదృష్టం. ఆయనే బతికుంటే తెలుగు చలనచిత్ర రంగంలో ఇంకా హీరోగానే ఉండేవారు. ఆయన కారణజన్ముడు. సినిమాలతో పాటు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నా. కేంద్ర ప్రభుత్వం నాకు పద్మభూషణ్ ఇవ్వడం గర్వంగా ఉంది. మీ అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటా' అంటూ చెప్పారు. అభిమానుల కేరింతలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది.

నేటితో ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్ ముగింపు


ఏలూరు అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ ఎస్జీటీలకు స్థానిక జడ్పీ మీటింగ్ హాలులో నిర్వహిస్తున్న మాన్యువల్ కౌన్సెలింగ్ శుక్రవారం కొనసాగింది. మొత్తం 800 మంది ఉపాధ్యాయులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానించగా, రాత్రి ఎంత ఆలస్యమైనా పూర్తి చేస్తామని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. జాబితాలోని చివరి ఉపాధ్యాయుని వరకు శనివారం బదిలీ కౌన్సెలింగ్‌ను చేపట్టి, మొత్తం బదిలీల ప్రక్రియను ముగిస్తామని వివరించారు. తప్పనిసరి బదిలీ టీచర్లు మినహా, రిక్వెస్టు బదిలీ కింద దరఖాస్తు చేసుకున్న వారంతా సీనియార్టీ నంబరు 1100 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంచి స్థానాలు లేకపోవడంతో అత్యధికులు బదిలీ వద్దని అన్‌విల్లింగ్ ఇచ్చి వెనుతిరిగారు.

డెంగీ లేకుండానే.. వైద్యం చేస్తారా ?

ఎన్టీఆర్ ఉచిత వైద్యంలో డబ్బులు వసూళ్లా : కలెక్టర్ ఆగ్రహం



భీమవరం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పేదల ప్రాణాలతో చెలగాటం ఆడతారా.. ? ఏ చిన్న పొరపాటు జరిగినా ఎంతటి హాస్పటల్ నైనా ఉపేక్షించేది లేదు. పుట్టిన పిల్లలకు కామెర్లు లేకుండానే, కామెర్ల పేరిట ఫొటోథెరపీ పేరుతో డబ్బులు వసూలు చేస్తారా ? డెంగీ లేకుండానే డెంగీ పేరిట వైద్యం చేసి డబ్బులు వసూలు చేసే ప్రయత్నం చేస్తారా ? డెంగ్యూ పేరిట రోగి నుంచి వసూలు చేసిన మొత్తానికి మూడు రెట్లు కలిపి అపరాధ రుసుం చెల్లించండి. అలాగే మరో కేసులో వసూలు చేసిన రూ.80 వేలకు రెట్టింపు అపరాధ రుసుం కట్టండి' అంటూ కలెక్టర్ సీహెచ్ నాగరాణి సంబంధిత ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్య సేవ ఉచిత చికిత్సలకు ఏ హాస్పటల్ అయినా డబ్బు వసూలు చేస్తే పెద్ద మొత్తంలో అపరాధ రుసుముతోపాటు, కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్టీఆర్ ఉచిత వైద్య సేవ చికిత్సలకు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై 17 హాస్పటల్స్‌పై వచ్చిన ఫిర్యాదులను విచారించి వాటి యాజమాన్యాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కీర్తిశ్రవణ్, వివిధ ప్రైవేట్ హాస్పటల్స్ వైద్యులు పాల్గొన్నారు.



అమ్మకు.. అండగా

వేలాది కుటుంబాల్లో సంబరాలు

తల్లుల ఖాతాకు జమ అయిన వందనం సొమ్ములు.. తొలి రోజు 30 శాతం మందికి ..

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా వేలాది కుటుంబాల్లో అంతులేని ఆనందం. చాలా రోజులుగా ఎదురుచూస్తున్న ఆ రోజులు రానే వచ్చాయి. ఎంత మందిని చదివిస్తే అంతమంది తల్లులకు తెలుగుదేశం సర్కారు వందనం చేసింది. తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమ చేసింది. జిల్లావ్యాప్తంగా శుక్రవారం ఎడలేని ఆనందం నింపింది. బడులు తెరిచిన రోజే తల్లుల ఖాతాలో డబ్బులు జమ చేస్తామంటూ తన మాటను సీఎం చంద్రబాబు అక్షరాలా రుజువు చేశారు. దీంతో అన్ని చోట్ల ఎక్కడికక్కడ తమ ఖాతాలను సరి చూసుకున్నారు. కొందరు ఆనందంతో పొంగిపోతే, ఇంకొందరు నిరాశ చెందారు. సంబంధిత శాఖాధికారులు మాత్రం అయోమయానికి గురవుతున్న తల్లులకు వివరణ

1120 మంది తల్లుల డేటాను అప్‌డేట్ చేయండి

తల్లికి వందనం ఆర్థికసాయం పథకానికి సాంకేతిక సమస్యల వల్ల అనర్హుల జాబితాలోవున్న 1120 మంది తల్లుల జాబితాను ప్రభుత్వం శుక్రవారం జిల్లా విద్యాశాఖకు పంపింది. వీరి ఆధార్, ఫోన్ నంబర్లలో అస్పష్టత వల్ల నగదు జమ చేయడానికి ఆటంకంగా ఉందని పేర్కొంది. శనివారం మధ్యాహ్నంలోగా వీటిని అప్‌డేట్ చేయాలని ఆదేశించింది.

మిగతా 8వ పేజీలో..

• **ఇక చదువులకు ఇబ్బంది లేదు**



మాకు ఇద్దరు పిల్లలు. గతంలో ఒక అబ్బాయికే అమ్మ ఒడి డబ్బులు పడేవి. ఇప్పుడు ఇద్దరు పిల్లలకి రూ.26 వేలు నా ఖాతాలో జమ అయ్యాయి. గతంలో కొంత ఆలస్యం చేసినా ప్రభుత్వం ప్రస్తుతం స్కూల్ తెరిచే సమయానికి డబ్బులు వేయడం పిల్లల చదువులకు ఇబ్బంది లేకుండా ఉంది.

- లంకా భవాని, తాడేపల్లిగూడెం

• **చాలా సంతోషంగా ఉంది**



ప్రభుత్వం అన్నట్టుగా మా ఇంటిలో వున్న ముగ్గురి పిల్లలకు తల్లికి వందనం పడింది. సమతా నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో సందీప్ 5వ తరగతి, పీటర్ 2వ తరగతి, సౌర్య 1వ తరగతి చదువుతున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని మా లాంటి వారికి ప్రభుత్వం ఇటువంటి సంక్షేమ పథకాలు అందజేయడం సంతోషంగా ఉంది.

- పొన్నారస్ ఉమాదేవి, ఆకివీడు



• **మధ్య తరగతికి చేయూత**

ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటి అమలు చేస్తున్నది. గతంలో ఇంటికి ఒక్కరికే అమ్మ ఒడి వేసేవారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇవ్వడం సంతోషంగా ఉంది. పవన్ 7వ తరగతి, తేజ శివదుర్గ 6వ తరగతి, యోగేష్ 4వ తరగతి చదువుతున్నారు. మా లాంటి మధ్య తరగతి కుటుంబాలకు ఈ సొమ్ము చేదోడు వాదోడుగా ఉంటుంది.

- బత్తుల నాగబాబు, ఆకివీడు

ఒకే కుటుంబంలో నలుగురికి



చంద్రబాబు చిత్రపటానికి సుందరరావు కుటుంబ సభ్యుల పాలాభిషేకం

ఆకివీడు రూరల్ జూన్ 13(ఆంధ్రజ్యోతి):ఆకివీడు మండలం సిద్దాపురం గ్రామంలోని ఒకే కుటుంబంలోని నలుగురు పిల్లలకు తల్లికి వందనం అర్హులుగా ఎంపికయ్యారు. ఎరిచర్ల రెబక, సుందరరావు దంపతులకు నలుగురు పిల్లలు. సిద్దాపురం జడ్పీ పాఠశాలలో ఎరిచర్ల అబీలా 9వ తరగతి, దీవెన 7వ తరగతి, సిద్దాపురం ఎంపీపీ పాఠశాలలో మానస 5వ తరగతి, యేసన్న 4వ తరగతి చదువుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అర్హుల లిస్టులో వారి పేర్లు ఉండటంతో ఆ కుటుంబం ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. సుందరరావు తాపీ పనిచేస్తుంటాడు. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో ఒక్కసారే ఒక్కరికే అమ్మ ఒడి వచ్చిందని, ఈసారి నలుగురు పిల్లలకు తల్లికి వందనం రావడం సీఎం చంద్రబాబు చలవేనని ఆనందం వ్యక్తం చేశాడు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఇంతకీ విషయం ఏమిటంటే.. సుందరరావు వైసీపీ అభిమాని కావడం విశేషం. టీడీపీ సీనియర్ నాయకులు భూపతిరాజు తిమ్మరాజు, పెనుమంత్ర సత్తులు, సత్యనారాయణ, గురువెల్లి గోపి, రఫీ తదితరులున్నారు.

ఆనందంతో నోట మాట రావడం లేదు



పెంటపాడు : పెంటపాడు మండలం మౌంజీపాడుకు చెందిన మెండ్యాల పెద్దిరాజు, దుర్గ దంపతులకు హేమశ్రీదుర్గ(9వ తరగతి), వాసవి(8), దుర్గా వెంకటలక్ష్మి(4), భానుమూర్తి(2వ తరగతి) మొత్తం నలుగురు పిల్లలు. వీరంతా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారు. ఈ నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం అర్హుల జాబితాలో పేర్కొన్నారు. అంటే ఈ కుటుంబానికి రూ.52 వేల సొమ్ము తల్లి దుర్గ ఖాతాలో జమ కానుంది. ఈ విషయం తెలియడంతో వారి ఆనందానికి అవధులు లేవు. తల్లి దుర్గ మాట్లాడుతూ

'మాకు చెప్పేందుకు నోట మాటలు రావడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మా పిల్లలలో ఒకరికి మాత్రమే అమ్మఒడి వచ్చింది. కూటమి ప్రభుత్వం నలుగురు పిల్లలకు తల్లికి వందనం ఇస్తున్నందుకు ఆనందంగా ఉంది. మా ఇంటిలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలు పెట్టి కృతజ్ఞతలు చెప్పుకున్నాం. వారికి మా ధన్యవాదాలు'

అంటూ తల్లి దుర్గ ఆనందాన్ని వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని ఆ కుటుంబ సభ్యులు తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్‌చౌదరి, సర్పంచ్ ఆలపాటి రామకృష్ణ, తదితరులకు చెప్పి ఆనందాన్ని పంచుకున్నారు.

మరి.. మా మాటేంటి ?

» అనర్హుల జాబితాలో రోజు కూలీలు

» 300 యూనిట్లు కరెంటు వాడారని, ఆదాయ పన్ను కడుతున్నారని పథకం నుంచి పేర్లు తొలగింపు

» న్యాయం చేయాలని వేడుకోలు

ఆకివీడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం సొమ్ములు పడిన లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపిస్తుంటే.. మరోవైపు అనర్హుల జాబితాలో పేరున్న వారు నిరాశ చెందుతున్నారు. తమకు తల్లికి వందనం పడుతుందని ఎదురుచూసిన లబ్ధిదారులకు అనర్హుల జాబితాలో తమ పేర్లు ఉండడంతో తీవ్ర నిరాశ చెందారు. ఆకివీడుకు చెందిన గొర్రెల గణనాథ-శ్రీదేవిలకు ఇద్దరు కుమారులు 6వ తరగతి, 3వ తరగతి చదువుతున్నారు. రైతు నాగరాజు-సుధారాణిలకు ఇద్దరబ్బాయిలలో చైతన్య, ఆదిత్య 8వ తరగతి, 4వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరి కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటిందని అనర్హుల జాబితాలో చూపించారు. కాని తమకు ఏడాది పొడవునా ఎప్పుడూ 300 యూనిట్లు దాటలేదని వారు చెబుతున్నారు. జిల్లాలో వేలాది మంది ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. రౌతు రామకృష్ణ-చిన్నమ్మడులకు ఇద్దరు కుమార్తెలు. వారు పదో తరగతి, ఆరో తరగతి చదువున్నారు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్నందున మీరు తల్లికి వందనంకు అనర్హులని సచివాలయంలో పెట్టిన జాబితాలో పేర్కొన్నారు. కాని, తామంతా కూలిపని చేసుకొని జీవిస్తున్నామని, ఆదాయ పన్ను ఎక్కడ కట్టామని వాపోతున్నారు. వీరే కాకుండా అనేక మందికి కరెంటు బిల్లు సగటున 300 యూనిట్లుకంటే ఎక్కువగా ఉందని, ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారని, నాలుగు చక్రాల వాహనం ఉందని, పట్టణ ప్రాంతంలో వెయ్యి చదరపు అడుగులకంటే ఎక్కువ స్థలం ఇల్లు కలిగి ఉందని, మీ కుటుంబంలో నెలసరి ఆదాయం రూ.12 వేలు కంటే ఎక్కువ ఉన్నందున, లబ్దిదారుడికి సాగు భూమి 3 ఎకరాలు కంటే ఎక్కువ ఉన్నందున అంటూ అనేక మంది అర్హులకు తల్లికి వందనం పడకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.



అనర్హుల జాబితాలో తమను ఉంచేశారని గణనాథ, నాగరాజు కుటుంబ సభ్యులు

అనర్హత జాబితాలో ఉంటే..

అర్హత ఉన్న వారి పేర్లు అనర్హుల జాబితాలో వుంటే.. వారికి ప్రభుత్వం ఓ అవకాశం కల్పించింది. అనర్హుల జాబితాలో చేర్చిన కారణాలపై వివరణ ఇవ్వాలి. ఉదాహరణకు విద్యుత్ బిల్లు తక్కువగా ఉంటే వాటిని సచివాలయానికి వెళ్లి చూపాలి. అక్కడ సిబ్బందితో ప్రభుత్వ వెబ్‌సైట్‌లో వీటిని పొందుపరచాలి. వాటిని పరిశీలించి ప్రభుత్వం తుది జాబితాను ఖరారు చేస్తుంది. అర్హత పొందిన వారికి తల్లికి వందనం సొమ్ములను జూలై 5న జమ చేస్తుంది.

ఐదేళ్లు దాటితే బదిలీ

» గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు మార్గదర్శకాలు » ఈ నెల 30వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశం

» ఉద్యోగుల హేతుబద్ధీకరణ ప్రాతిపదిక.. దివ్యాంగులకు తొలి ప్రాధాన్యత

భీమవరం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 30వ తేదీలోగా దీనిని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు బాధ్యతలు అప్పగించింది. బదిలీల అనంతరం ఉద్యోగుల వివరాలను, రాష్ట్ర ప్రభుత్వ హెచ్ఆర్ఎంఎస్ పోర్టల్‌లో వచ్చే నెల 10వ తేదీలోగా పొందుపరచాలి. వార్డు, గ్రామ సచివాలయాల్లో ఈ ఏడాది మే 31 నాటికి ఐదేళ్లు పూర్తయిన ప్రతీ సచివాలయ ఉద్యోగిని బదిలీ చేస్తారు. ఉద్యోగుల హేతుబద్ధీకరణతోపాటు బదిలీల ప్రక్రియ పూర్తి చేసేలా ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. సచివాలయ ఉద్యోగులు హేతుబద్ధీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీచేసింది. అందుకు క్లస్టర్లను పరిగణలోకి తీసుకుంది. పట్టణాలు, పల్లెల్లో రెండు సచివాలయాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటుచేశారు. జనాభా నిష్పత్తిని బట్టి ఆరుగురు, ఏడుగురు, ఎనిమిది మంది సిబ్బంది ఉండేలా సచివాలయాలను మూడు కేటగిరిలుగా విభజించారు. క్లస్టర్ పరిధిలో సిబ్బంది హేతుబద్ధీకరణను ప్రామాణికంగా తీసుకున్నారు. ఉదాహరణకు సర్వేయర్ క్లస్టర్ పరిధిలో ఒక సచివాలయంలో ఉంటే రెండింటిలోను విధులు నిర్వహించాలి. సర్వేయర్ లేని సచివాలయాలకు కొత్త పోస్టింగ్ ఇవ్వరు. సదరు క్లస్టర్ పరిధిలో సర్వేయర్ రెండు సచివాలయాల బాధ్యతలు నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం సిబ్బంది హేతుబద్ధీకరణకు ఇదే సూత్రాన్ని అనుసరించింది. మిగులు సిబ్బందిని ఇతర సచివాలయాలకు, ఇతర మండలాలకు పంపిస్తారు. అవసరం లేదనుకుంటే అదే సచివాలయంలో మిగులు సిబ్బంది పనిచేయనున్నారు.



జిల్లాలో 535 సచివాలయాలు

జిల్లాలో 535 సచివాలయాలు ఉన్నాయి. వాటిని 275 క్లస్టర్లుగా విభజించారు. క్లస్టర్

మిగతా 8వ పేజీలో..

మేం ఇక్కడ పనిచేయలేం !

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లా వాణిజ్య కేంద్రంగా గుర్తింపు పొందిన ఆ పట్టణ మునిసిపల్ అధికారి తీరుతో వార్డు సచివాలయ సిబ్బంది హడలిపోతున్నారు. ఆ అధికారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత 15 మంది మెడికల్ లీవ్‌లు పెట్టారు. సెలవులకు అనుమతి ఇవ్వకపోవడంతో ఈ లీవ్‌ను రిజిస్టర్ పోస్టులో పంపుతున్నారు. విధుల్లో హాజరైతే సెలవులకు సంబంధించిన వేతనాన్ని నిబంధనల మేరకు ఇవ్వాలి. కానీ, ఆ అధికారి వాటిని మెడికల్ లీవ్‌కు అర్హత ఉందా ? లేదా ? అని నిర్ధారించాలంటూ బోర్డును కోరుతున్నారు. వీటిపై బోర్డు అధికారులు అంతగా స్పందించలేదు. ఫలితంగా ఉద్యోగులకు మెడికల్ లీవ్ వేతనం, ఇతర బిల్లులు మంజూరు కావడం లేదు. విధుల పేరుతో ఒత్తిడి పెంచుతున్నారని సిబ్బంది ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాజాగా ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల బదిలీలకు అనుమతి ఇవ్వడంతో సదరు మున్సిపాలిటీని వదిలి పెట్టేందుకు అంతా సిద్ధమవుతున్నారు. ఐదేళ్లు దాటిన వారంతా వెళ్లిపోవాలి. అలాగని ఇటీవల బదిలీపై వచ్చిన వారు సైతం ఇప్పుడు అభ్యర్థన పెట్టుకుని ఇతర మున్సిపాలిటీలకు వెళ్లిపోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇతర మున్సిపాలిటీల్లో సచివాలయ సిబ్బంది ఈ పట్టణానికి రావడానికి ఆసక్తి చూపడం లేదు. దీనిపై ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.



మరికొన్ని గంటల్లో తీరంలో వేట సందడి మొదలుకానుంది. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ రాత్రి వరకు కేంద్రం సముద్ర తీరంలో వేట నిషేధాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని 19 కిలోమీటర్ల మేర సముద్రంలో వేట ఉండదు. ఈ గడువు శనివారం అర్ధరాత్రితో ముగుస్తుంది. ఆదివారం నుంచి వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల నుంచి బోట్లు తీర ప్రాంతానికి చేరుకున్నాయి.

వేటకు సంద్రం సిద్ధం

» నేటి అర్ధరాత్రి నుంచి నిషేధాజ్ఞల ఎత్తివేత

» సముద్ర తీరానికి చేరుకుంటున్న బోట్లు

» ఈ సీజన్‌పైనే మత్స్యకారుల ఆశలు

నరసాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వేట దగ్గర పడుతుండటంతో మత్స్యకారులు బోట్లు, పడవలు, వలలను సిద్ధం చేసుకున్నారు. తీరంలోని రెండు మండలాల్లో సముద్ర వేట సాగించే మత్స్యకారులు మూడు వేలకు పైగా ఉండగా గుర్తింపు పొందిన వారు 1,802 మంది మాత్రమే. వీరు సోనా, ఫైబర్ బోట్లపై సముద్రంలో వేటకు వెళతారు. మిగిలిన వారు సంప్రదాయ మత్స్యకారులే. నాటు పడవలపై కొంత దూరం వెళ్లి వేట సాగించి సాయంత్రం తీరానికి వస్తుంటారు. మరికొందరు గ్రూప్‌లుగా ఏర్పడి ఐలు వలలు కడుతుంటారు. పోటు, పాటులకు పడే మత్స్య సంపదను విక్రయించి ఆ వచ్చిన మొత్తాన్ని పంచుకుని జీవనం సాగిస్తున్నారు. గోదావరి, సముద్రం కలిసే ప్రదేశం కావడంతో ఇక్కడ అపార మత్స్య సంపద దొరుకుతుంది. ఈ కారణంగా స్థానిక మత్స్యకారులతోపాటు ఇక్కడ వేటాడేందుకు మచిలీపట్నం, కాకినాడ, ఒంగోలు, నెల్లూరు ప్రాంతాల నుంచి 500కు పైగా బోట్లపై వేట సాగిస్తాయి. నరసాపురం, కోనసీమ జిల్లా అంతర్వేది గుండా సముద్రంలోకి వేటకు వెళతుంటారు. ఇప్పటికే కొన్ని బోట్లు తీరానికి చేరుకున్నారు.

గత ఏడాది తుఫాన్ల కారణంగా ఆశించిన స్థాయిలో వేట సాగలేదు. నెలలో రెండు, మూడు తుఫాన్లు సంభవించాయి. ఈ ఏడాది సీజన్‌పైనే మత్స్యకారులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే వర్షాలు కురుస్తుండటం, ప్రకృతి అనుకూలంగా ఉండటం, ముందుగా వరదలు వచ్చే అవకాశం ఉండటంతో వేట కలిసొచ్చి లాభాలు తెచ్చి పెడతాయని గంగమ్మ తల్లిపై ఆశలు పెట్టుకున్నారు.

ముందుగానే భృతి

ఏప్రిల్, మే నెలల్లో సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి జరుగుతుంది. ఈ సమయంలో వేటాడితే సంపద హరిస్తుందని దేశవ్యాప్తంగా ఈ రెండు నెలలు కేంద్ర

మిగతా 8వ పేజీలో..



కొత్తగా వచ్చిన బుక్స్‌తో విద్యార్థినులు

విద్యా కిట్ భేష్

చిన్నారులకు తగ్గిన పుస్తకాల బరువు

బ్యాగ్‌లు, నోట్ పుస్తకాల్లో నాణ్యత

పాఠశాలలకు చేరిన విద్యా కిట్లు



భీమవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన రూపు మార్చిన ప్రభుత్వం ఉచితంగా అందించే విద్యాకిట్‌లలో మార్పులు తెచ్చింది. కిట్‌లు భేష్‌గా కనిపిస్తున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో 1,392 ప్రభుత్వ పాఠశాలల్లోని దాదాపు లక్ష మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పాఠశాలలకు చేర్చారు. ఏలూరు జిల్లాలో మొత్తం 2,259 పాఠశాలలకు సంబంధించి కిట్లను అందించనున్నారు. గత ప్రభుత్వ కిట్‌లకు ఇప్పటి కిట్‌ల నాణ్యతలో ఎంతో మార్పు కనిపిస్తున్నది. ప్రైమరీ విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించారు. ఒకే పాఠ్యపుస్తకంలో రెండు మూడు సబ్జెక్టులు పొందుపరచడంపై ఉపాధ్యాయుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. 1, 2 తరగతులకు ఒకే పాఠ్యపుస్తకంలో తెలుగు, ఇంగ్లిష్, లెక్కలు సబ్జెక్టులు ఉండేలా రూపొందించారు. ఒకే వర్క్ బుక్‌ను మూడు సబ్జెక్టులకు ఇచ్చారు. దీంతో రెండు పుస్తకాలతో చిన్నారులు పాఠశాలకు వెళ్తే సరిపోతుంది. 3 నుంచి 5 తరగతి విద్యార్థులకు రెండు పాఠ్య పుస్తకాలు, రెండు వర్క్‌బుక్‌లలో చదువుకునేలా పొందుపరిచారు. దీంతో విద్యా బోధన సులువుగా ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఏడాదిపాటు ఉపయోగించినా బ్యాగ్ పాడవకుండా క్వాలిటీగా ఉన్న బ్యాగ్‌లు అందిస్తున్నారు. షూస్, బెల్ట్, నోట్ పుస్తకాలు నాణ్యతగా ఉన్నాయి. దీంతో ఇటు తల్లిదండ్రులు విద్యార్థులు విద్యా కిట్‌లు బావున్నాయని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

విద్యాసామాగ్రి ఇలా..

పశ్చిమ గోదావరి జిల్లాలో 12 లక్షల 59 వేల 564 పాఠ్యపుస్తకాలు, 6 లక్షల 51 వేల 038 నోట్ పుస్తకాలు, 1 లక్షా 47 డిక్షనరీలు అందిస్తున్నారు. 93,458 బ్యాగ్‌లు, 93,453 యూనిఫామ్, 92,586 షూస్, 61 వేల 338 బెల్ట్‌లు అందించనున్నారు. ఏలూరు జిల్లాలో 6 లక్షల 98 వేల 68 మందికి పాఠ్యపుస్తకాలు, 7 లక్షల 62 వేల 28 మందికి నోట్ బుక్స్ 1,22,665 బ్యాగ్‌లు, 1,22,665 యూనిఫాం, 1,23,91 షూస్, 84, 154 బెల్ట్‌లు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

గతంలో అంతా డొల్ల

గత ప్రభుత్వం హయాంలో విద్యా కిట్లన్నీ డొల్లతనంగా ఉండేవి. స్కూల్ బ్యాగ్‌లపై బొమ్మలు వేసుకోవడానికి చూపించిన శ్రద్ధ నాణ్యతపై చూపించలేదు. దీంతో అవి మూడు నెలలకే పాడైపోయాయి. ఇతర సామగ్రి అంతే. పాఠ్యపుస్తకాలు ప్రైమరీలో ఇప్పటిలా రెండు సెమిస్టర్లు ఉండేవి కాదు.

విద్యార్థులకు ఎంతో మేలు



1, 2 తరగతుల విద్యార్థులలో బరువు లేకుండా పుస్తకాలు రూపుదిద్దారు. వారు సులువుగా చదువుకునేలా పాఠ్యాంశాలు పెట్టారు. రెండు సెమిస్టర్లు ఏర్పాటు చేయడం వల్ల చిన్నారులకు సబ్జెక్టులపై పట్టు వస్తుంది. ప్రభుత్వ ఆలోచన బాగుంది.

- బీడీకె మహనీయం, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు

బరువు తగ్గించారు



పాఠశాలకు దూరం నుంచి వస్తాను. రెండు సెమిస్టర్లు చేసి పుస్తకాల బరువు తగ్గించారు. బ్యాగ్, నోట్ పుస్తకాలు చాలా బాగున్నాయి.

- జోస్య మహాలక్ష్మి, విద్యార్థిని

అప్పుడలా..ఇప్పుడిలా..



లింగపాలెం : గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు అందించిన పుస్తకాలు, నోట్ బుక్స్ బ్యాగులపై అప్పటి ముఖ్యమంత్రి తన పేరుతో జగనన్న విద్యాకానుక అని పేరు ముద్రించి ఇచ్చారు. కూటమి ప్రభుత్వం బ్యాగులపై సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర అని ముద్రించి ఆదర్శవంతంగా నిలిచింది.

ఎడాపెడా మట్టి తోలకాలు

పాడైపోతున్న రహదారులు

వేసవి కాలం వచ్చిందంటే మట్టి వ్యాపారస్థులకు పండగే.. వేసవి కాలం అంతా రోడ్ల పక్కన రోడ్లుపక్కన లే అవుట్‌లు పూడ్చడం, చెరువులు పూడ్చటం వంటివి చేపడతారు. రైతులకు సంబంధించి తమ భూములో మట్టిని తవ్వేందుకు సంబంధిత అధికారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. మట్టి అక్రమార్కులు మాత్రం రైతుకు ఇటువంటి నిబంధనలు చెప్పకుండా వారే ట్రాక్టర్‌ల సహాయంతో రైతులు భూముల్లోకి మట్టిని రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా తోలేస్తున్నారు. మట్టి ట్రాక్టర్ల వల్ల ఇటీవల వేసిన రహదారులు పాడైపోతున్నాయి. మట్టి బెరడులు పడి రోడ్లన్నీ బురదగా మారుతున్నాయి. వాహనదారులు బైక్‌లపై నుంచి జారి పడిపోతున్నారు..అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

- పెనుగొండ,(ఆంధ్రజ్యోతి)



వడలిలో ట్రాక్టర్‌పై మట్టి తరలింపు



రహదారిపై పడిన మట్టి

తెల్లవారితే మైక్‌ల హోరు !

వ్యాపారుల ప్రచారంతో ఇబ్బందులకు గురవుతున్న వృద్ధులు, రోగులు

ఒకవైపు అటవీ ప్రాంతం, మరో వైపు మెట్ట ప్రాంతం.. గోదావరి పరివాహక ప్రాంతాలతో చక్కని ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పల్లెల కనిపిస్తాయి. పట్టణాల్లో ఉద్యోగాలు చేసేవారైనా ప్రశాంతత కోసం గ్రామాల్లోనే ఉంటారు. రణగొణ ధ్వనులు లేకుండా హాయిగా నిద్రపోవచ్చని అనుకుంటారు. తెల్లవారుజామున కాస్త అలసట తీర్చుకుంటున్న సమయంలో చికాకు పుట్టించే శబ్దాలతో బండ్లపై విక్రయించే చిరు వ్యాపారులు ఒకరు వెనకాల ఒకరు వస్తుండడంతో ఇబ్బందులకు గురవు తున్నారు. పల్లె నుంచి పట్టణం వరకూ ఈ మైక్‌ల హోరుతో చికాకు పుట్టిస్తున్నారు. ఉదయాన్నే మైక్ పెట్టి వంద రూపాయలకు ఏడు కేజీల ఉల్లిపాయలు అంటూ ఒక మైక్ వెళ్ళగా... కొత్తిమీర, పుదీనా అంటూ మరో మైక్ వస్తుంది... పాతసామాన్లు కొంటాం, ప్లాస్టిక్ సామాన్లు,ఇనుప సామాన్లు, పాత ఏసీలు, పాత బ్యాటరీలు కొంటాం.. ఇనుప వస్తువులకు ఉల్లిపాయలు ఇస్తామంటూ ఇంకో మైక్. సీజనల్ ఫ్రూట్స్ వారు కూడా మైక్‌లను పెట్టుకుని హోరెత్తిస్తున్నారు.నిత్యం కూరగాయలు అమ్మే వ్యక్తి కూడా ఈ మైక్‌తోనే గోలపెట్టడంతో ఏ వీధి చూసినా, ఏ ప్రాంతం చూసినా భరించలేక ఎవరితో చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉంటున్నారు. ముఖ్యంగా ఉదయాన్నే పిల్లలు చదువుకోవడం, వృద్ధులు నిద్ర పోతున్న సమయంలో ఈ మైక్‌ల గోల పెరిగిపోవడంతో విసుగెత్తిపోతున్నారు. పగటి వేళ సాధారణంగా 50 డెసిబుల్స్, రాత్రి వేళ 40 డెసిబుల్స్ సౌండ్ దాటకూడదు. ప్రస్తుతం ప్రతి వ్యాపారి కూడా మైక్‌లు పెట్టి 80 డెసిబుల్స్ దాటి సౌండ్‌లతో మైక్‌లను వినియోగిస్తున్నారు. దీని వల్ల ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు వీటిని కట్టడి చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుకుంటున్నారు.

- ఏలూరు క్రైం (ఆంధ్రజ్యోతి)



బళ్లపై మైక్‌లు పెట్టుకుని అమ్మకాలు



ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన యోగాలో పాల్గొన్న వేలాది మంది

యోగాతో ఆరోగ్యం

ఏలూరుసిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల థీమ్ యోగాతో హేలాపురి నగరం పులకరించింది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులతో ప్రదర్శించిన యోగా ముద్ర ఆకృతి అందరినీ ఆకట్టుకుంది. జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి, ఎమ్మెల్యేలు బడేటి చంటి,



ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

హేలాపురిలో యోగా సందడి

పాల్గొన్న వేలాది మంది

చింతమనేని ప్రభాకర్ , జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి , రెడ్డి అప్పలనాయుడు తదితరులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ నిత్యజీవితంలో యోగా భాగం కావాలన్నారు. మనదేశ సంస్కృతిలో భాగమైన యోగా ప్రపంచ దేశాలు ఆచరిస్తున్నాయన్నారు. ఈనెల 21 న విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ఏలూరు జిల్లాలో ఇప్పటిరవకు 8,43,302 మంది ఎంతో ఉత్సాహంగా యోగా కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు తమపేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఈనెల 14 వతేదీన కూడా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగాంధ్ర మాస్ డిమాన్‌స్ట్రేషన్ నిర్వహిస్తారన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ నెల రోజులుగా ప్రజలకు యోగాను పరిచయం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ యోగా పట్ల అందరూ అవగాహన పెంచుకుని ఆరోగ్యం మెరుగుపరచుకోవాలన్నారు. తనకు యోగాపై అవగాహన ఇప్పటివరకు లేదని యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుని తాను కూడా యోగాసనాలపై మక్కువ పెంచుకున్నానన్నారు. ఏలూరు, దెందులూరు ఏఎంసి చైర్మన్‌లు మామిళ్ళపల్లి పార్థసారధి, గారపాటి రామసీత , కార్పోరేషన్ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, డీఆర్‌వో విశ్వేశ్వరరావుతో పాటు జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆసనాలతో ఆకట్టుకున్న యోగా ట్రైనర్



యోగా కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రి రెడ్డి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి



యోగాతో మనసు ఉత్తేజం..

క్షీరపురి యోగా సత్సంగం గురువు జువ్వాజీ కల్యాణ్

పాలకొల్లు, జూన్, 13 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజూ యోగా చేయడం వల్ల మనసు ఉత్తేజభరితం అవుతుందని, మంచి శక్తిని పొందడంతో పాటు శరీర సౌష్టవాన్ని పొందవచ్చునని పాలకొల్లు క్షీరపురి యోగ సత్సంగం నిర్వాహకుడు, యోగా గురువు జవ్వాజీ కల్యాణ్ తెలిపారు. 18 ఏళ్లగా యోగా చేస్తున్నట్లు తెలిపారు. యోగాతో వత్తిడి తగ్గించుకోవడం, రక్త ప్రసరణ మెరుగు పరచుకోవచ్చునని తెలిపారు. ఇప్పటి వరకూ సుమారుగా 300 మందికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. బ్రహ్మ ముహూర్తంలో యోగా చేయడం వల్ల చాలామందికి వారి వ్యాధి రుగ్మతల నుంచి ఉపశమనం లభించిందని, ముఖ్యంగా మహిళలకు యోగాలో శిక్షణ పొందడం మంచిదని తెలిపారు. ప్రతీ రోజూ 150 మందికి యోగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం, ఆసనాలు నేర్పిస్తానని తెలిపారు.

రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు

కొత్త కొత్త నిబంధనలతో అవస్థలు

ఇప్పటికే స్లాట్ బుక్కింగ్‌లో తరచూ ఇబ్బందులు

పాన్‌కార్డు తప్పనిసరి చేయడంపై కక్షిదారుల్లో అసహనం



ఆచంట,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రతీ రోజూ రిజిస్ట్రేషన్ ద్వారా కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. అయితే రోజుకో కొత్త నిబంధనలు పెడుతుండటంతో రిజిస్ట్రేషన్‌లు సజావుగా సాగడం లేదు. అనేక ఆటంకాలు కలుగుతూనే ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం 2.0 విధానం తీసుకువచ్చింది. దాని తరువాత స్లాట్‌బుక్కింగ్ విధానాన్ని తీసుకువచ్చారు. ఈ విధానంతో మొదట్లో సర్వర్ సరిగ్గా పని చేయక రిజిస్ట్రేషన్‌కు తరచూ ఆటంకాలు ఏర్పడుటుతుండంతో కక్షిదారులు ఇబ్బందులు పడుతూనే ఉంటున్నారు. తరచూ సర్వర్ సమస్య నెట్‌సౌకర్యం సరిగ్గా పని చేయకపోవడంతో గంటలు కొద్దీ కక్షిదారులు కార్యాలయం వద్దే ఉండే పరిస్థితి తరచూ ఏర్పడుతూనే ఉంది. ఇదిలా ఉండగా మరలా ప్రస్తుతం ఇపుడు రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కక్షిదారులు ఎంత మంది ఉన్నా వారికి తప్పనిసరిగా ఆధార్‌తో పాటు పాన్ కార్డులో డేటాఫ్ బర్త్ ఉంటేనే పబ్లిక్ డేటా అవుతుంది. పాన్‌కార్డు, డేట్ ఆఫ్‌బర్త్ విధానం శుక్రవారం నుంచి అమలులోకి రావడంతో అనేక మంది కక్షిదారులకు పాన్‌కార్డు లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌లకు అనేక చోట్ల ఆటంకాలు కలిగాయి. దీంతో ఏ దస్తావేజుకైనా తప్పనిసరిగా కక్షిదారులు అందరికి కూడా పాన్ కార్డులు ఉంటేనే రిజిస్ట్రేషన్లు జరగడానికి అవకాశం ఉంది. ప్రభుత్వానికి ప్రతీ రోజూ కోట్ల రూపాయలు ఆదాయం వచ్చే శాఖపైనే సంబంధిత శాఖల అధికారులు ఆంక్షలు ఎక్కుపెడతారని కొంత మంది కక్షిదారులు అంటున్నారు. పాన్‌కార్డు తప్పనిసరి కావడం వల్ల అమ్మకం, కొనుగోలుదారులకు ఇబ్బందులు తప్పవు.

ఏఎన్‌ఎంల బదిలీలు పారదర్శకమేనా?

నేడు ఉమ్మడి జిల్లా రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు జూమ్ పద్ధతిన కౌన్సెలింగ్

రేపు గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) పదోన్నతులు

ఏలూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో అన్ని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో పనిచేస్తున్న రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు సాధారణ బదిలీ కౌన్సెలింగ్‌ను శనివారం జూమ్ విధానంలో నిర్వహించనున్నారు. నిబంధనల ప్రకారం ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన ఏఎన్‌ఎంలందరినీ తప్పనిసరి బదిలీ కింద అందుబాటులో వున్న వేకెన్సీలకు ఐచ్ఛికాలను తీసుకుని నూతన స్థానాలను కేటాయిస్తారు. ఆ మేరకు ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న 190 మంది సీనియర్ ఏఎన్‌ఎంలను గుర్తించగా, వీరిలో రెండేళ్లలో ఉద్యోగ విరమణ చేయనున్నవారిని, ఉద్యోగ సంఘాల నాయకులను మినహాయించి మిగతావారికి స్థానచలనం కలిగించనున్నారు. ఆ ప్రకారం కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ కింద గుర్తించిన 190 మంది రెగ్యులర్ ఏఎన్‌ఎంల వేకెన్సీలను జాబితాలో ప్రదర్శించాల్సి ఉండగా, వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసిన జాబితాలో 186 క్లియర్ వేకెన్సీలనే చూపడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు తప్పనిసరి బదిలీ కింద కదలాల్సిన ఏఎన్‌ఎంలలో పలువురు తమలో తామే అయా పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు ఐచ్ఛికాలను ముందుగానే ఎంచుకుని పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో నూతనస్థానాలను ఖాయం చేసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాగ్ధాటి వున్నవారికి మంచిస్థానాలు, నోరు మెదపలేని వారికి సుదూర ప్రాంతాలే తప్పనిసరి అవుతాయని ప్రచారం జరుగుతోంది.

నిబంధనల మేరకే బదిలీ స్థానాల కేటాయింపు : డాక్టర్ గంగాభవాని, డీఎంహెచ్‌వో కార్యాలయ పరిపాలనాధికారి

బదిలీల్లో ఉద్యోగి ప్రస్తుతం పనిచేస్తున్న మండలం లేదా డీడీవో మారాలన్న నిబంధనేదీ లేదు. శనివారం ఉమ్మడి జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారుల సమక్షంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు బదిలీల నిమిత్తం ఏఎన్‌ఎంలు హాజరుకావాలి. ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద దరఖాస్తు చేసుకున్న ఏఎన్‌ఎంల ధ్రువపత్రాలన్నింటినీ పరిశీలించాం. రీ-డిప్లాయిమెంట్ (వర్క్ అడ్జస్ట్‌మెంట్) కింద వేర్వేరు చోట్ల పనిచేస్తున్న కంపల్సరీ ట్రాన్స్‌ఫర్ ఉద్యోగులు బదిలీవద్దంటే వారిని మినహాయించేందుకు సడలింపునిస్తాం. ఉమ్మడి జిల్లాలోని సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్‌ఎంలుగా పనిచేస్తున్న 256 మందికి ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్) పదోన్నతుల కౌన్సెలింగ్‌ను ఆదివారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహిస్తాం.

ఎదురుచూపులేనా ?

ఎర్రకాలువ రైతుల ఆవేదన

గతేడాది వరదలకు పంటనష్టం

ఇప్పటికీ పరిహారం అందకపోవడంపై అన్నదాతల్లో ఆందోళన

తాడేపల్లిగూడెం రూరల్, (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి పగపట్టింది..కనీసం ప్రభుత్వమైనా కనికరిస్తుందనే రైతుల ఎదురుచూపులు నేటికీ ఫలించలేదు. గత సంవత్సరం జూలై నెలలో వచ్చిన ఎర్రకాలువ వరదలకు పంట నష్టపోయిన ప్రాంత రైతులకు ప్రభుత్వ పంట నష్టం అదించాల్సి ఉంది. కానీ ఆ తరువాత ఆగస్టులో వచ్చిన వర్షాలకు నష్టపోయిన పంటకు పరిహారం ప్రకటించారు. కానీ అంతకు ముందు నష్టపోయిన పంటకు పరిహారం ప్రకటించడంలో ప్రభుత్వ మీనమేషాలు లెక్కిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ నెలలో జిల్లాలో పంట నష్టం అంచ నాలను అధికారులు లెక్కించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దానికి సంబంధించి సుమారు రూ.9 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై ఇటీవల ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణలు అసెంబ్లీలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. అయితే నేటికి రైతులకు ఆ పరిహారం అందకపోవడంతో ఇటీవల జరిగిన అసంబ్లీ సమావేశాల్లో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పరిహారం అంశాన్ని సభ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ దఫా వచ్చే పరిహారంలో ప్రభుత్వం తమకు పంటనష్టం అందిస్తుందని రైతులు ఆశ పడ్డారు.

అగ్రభాగం తాడేపల్లిగూడేనికే

ఎర్రకాలువ వరదల కారణంగా గతేడాది జూలైలో ప్రకృతి వైపరీత్యానికి జిల్లాలో 9 కోట్ల రూపాయల పరిహారం అందించాల్సి ఉండగా వాటిలో తాడేపల్లిగూడెం మండలంలోని ఎర్రకాలువ పరివాహక ప్రాంత రైతులకే రూ.6 కోట్లు చెల్లించాల్సి ఉంది. మొత్తం జిల్లాలో సుమారు 2,200 మంది రైతులకు పరిహారం అందాల్సి ఉండగా తాడేపల్లిగూడెం మండలంలోని మాధవరం, జగన్నాధపురం, మారంపల్లి, అప్పారావుపేట, నందమూరు తదితర గ్రామాల రైతులకు ఈ పరిహారం అందించాల్సి ఉంది.

తీవ్రంగా నష్టపోయాం..



ఎర్రకాలువ వరదలకు మా ప్రాంతం అంతా పంట తీవ్రంగా నష్టపోయాం. మాకు ప్రత్యే కంగా ఎనిమిదిన్నర ఎకరాలకు పరిహారం అందాల్సి ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి మాకు పరిహారం అందించాలని కలెక్టర్, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్లాం.

- ముళ్లపూడి రామకృష్ణ, జగన్నాధపురం రైతు

ఏడాదిగా ఎదురుచూస్తున్నాం

మా ప్రాంతంలో పంట నష్టం జూలైలో సంభవించింది. ఆగస్టులో పంటనష్టపోయిన వారికి పరిహారం అందించారు. పరిహారం అందుతుందని రైతులంతా ఏడాదిగా ఎదురు చూస్తున్నాం. మా ప్రాంత ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అసంబ్లీలో పరిహారం కోసం వివరించారు. నేటికీ ఆ పరిహారం అందలేదు..



-పరిమి వీరభద్రరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు నవాబుపాలెం



ఎర్రకాలువ వరద పోటుతో గట్లు తెంచుకుంటూ చేలల్లోకి వరదనీరు (ఫైల్)

నిస్వార్థంగా పనిచేస్తున్నా.. అడ్డొస్తే ఊరుకోను

డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు



మాట్లాడుతున్న రఘురామకృష్ణరాజు

కాళ్ళ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిస్వార్థంగా పని చేస్తున్నానని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా పెద అమిరంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలుత విమాన ప్రమాద మృతులకు సంతాపం తెలిపిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం చేసిన మరుసటిరోజే సాగునీరు, డ్రెయిన్ల వ్యవస్థ మెరుగుపరుస్తానని అప్పటి కలెక్టర్‌తో భేటీ అయిన సందర్భంలో చెప్పగా ఖజానా ఖాళీగా ఉందని, నిధులు భారీగా ఇవ్వలేమనటంతో తాను, తన స్నేహితులు, ప్రజల సహకారంతో 'ఉండి డ్రెయినేజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్' పేరిట నిధిని ఏర్పాటు చేసి పనులు ప్రారంభించామన్నారు. నియోజకవర్గంలో ప్రధాన మంచినీటి సమస్యను అధిగమించడానికి గ్రామాల్లో మైక్రోఫిల్టర్లను ప్రభుత్వం, దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పంట కాలువలను కలుషితం చేస్తున్న ఆక్వా రైతులను గుర్తించి వారిపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొంత మంది ఆక్వా రైతులు కాలువ గట్లను ఆక్రమించుకుని వాడుకుంటున్నారని, దీనివల్ల కాలువల ఆధునీకరణ జరగడం ఇబ్బందిగా మారిన తరుణంలో కులమతాలకతీతంగా ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. ఇళ్లు తొలగించినవారికి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. తాను నిస్వార్థంగా పనిచేస్తున్నానని, తన విధులకు ఏ స్థాయి వారు అడ్డు వచ్చినా సహించనన్నారు. ప్రతిచోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, దీని వల్ల అన్ని నేరాలు బయటపడే అవకాశం ఉందన్నారు. అదే విధంగా లే అవుట్లు వేసేవారు అప్రూవ్డ్ లే అవుట్‌లు వేసి మాత్రమే అమ్మాలన్నారు. తన ఇల్లు ఎంత శుభ్రంగా ఉంటుందో తన నియోజకవర్గమంతా అలాగే ఉండాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. రాబోయే ఆరు నెలల్లో ప్రారంభించిన పనులన్నీ పూర్తి చేస్తానని తెలిపారు.

జడ్పీ సీఈవోగా శ్రీహరి బాధ్యతల స్వీకారం



నూతన సీఈవోను అభినందిస్తున్న ఉద్యోగులు

ఏలూరు సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సీఈఓగా ఎం. శ్రీహరి శుక్రవారం ఏలూరు జడ్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జడ్పీ సీఈఓగా అదనపు బాధ్యతలతో పనిచేస్తున్న కె. భీమేశ్వర్ డిప్యూటీ సీఈఓగా కొనసాగుతారు. శ్రీహరి నెల్లూరు జిల్లాలో ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఉమ్మడి పశ్చిమగోదావరి జడ్పీ సీఈఓగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ నేతృత్వంలో జిల్లా అధికారులు, ఎంపీడీవోల సహకారంతో జిల్లాను ప్రగతి పథంలోకి తీసుకువెళతానని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన శ్రీహరిని జడ్పీ ఏఓలు ప్రకాష్, జాన్సన్, రాఘవులు, కనకరాజు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రాజు, కార్యదర్శి గోపాలకృష్ణ తదితరులు అభినందించారు.


పునరావాస కాలనీకి తరలండి : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో ఎంవీ రమణ

కుక్కునూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదలు వచ్చే సమయం ఆసన్నమైనందున ముందే పునరావాస కాలనీకి తరలి రావాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ నిర్వాసితులను ఆదేశించారు. శుక్రవారం దాచారం పునరావాస కాలనీలో గొమ్ముగూడెం, లచ్చిగూడెం నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఇప్పటికే గొమ్ముగూడెం గ్రామస్థుల భూములకు వ్యక్తిగత పరిహారం చెల్లించిన క్రమంలో జంగారెడ్డిగూడెం మండలం చల్లావారిగూడెం తరలి వెళ్లాల్సి ఉంది. అయితే అక్కడ నిర్మాణాలు ఇంకా పూర్తికాక దాచారం పునరావాస కాలనీకి తరలిరావాలని ఆర్డీవో సూచించగా నిర్వాసితులు దాచారం పునరావాస కాలనీలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు లేవని నిర్వాసితులు తెలపగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని, ముందుగానే తరలిరావడానికి సిద్ధంగా ఉండాలని ఆర్డీవో కోరారు. అంతకు ముందు కుక్కునూరు జడ్పీ హైస్కూలులో సన్న బియ్యం, మెనూ పరిశీలించి మెనూ పాటించాలని సూచించారు. తహసీల్దార్ రమేశ్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అభయారణ్యంలో అక్రమ పూడ్చివేతల పరిశీలన



ఫారెస్టు అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఆకివీడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు అభయారణ్యంలో ఆక్రమణలకు పాల్పడి పూడ్చివేత పనులు చేపట్టిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి రామలింగాచార్యులు హెచ్చరించారు. స్థానిక సమతానగర్ శివారులో అభయారణ్య పరిధిలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి కాలువ వెంబడి అడ్డగోలుగా మట్టితో పూడ్చేస్తున్నారని రైతులు, నాయకుల ఫిర్యాదు మేర శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రెవెన్యూ సిబ్బందితో కొలతలు చేపట్టామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంతో జరిమానా విధిస్తామని తహసీల్దార్ తెలపగా, ఎఫ్ఆర్వో కేసు నమోదు చేస్తామన్నారు. అంతేకాక ఆ ప్రాంతంలో బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు.

డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా రాజేష్



నియామకపత్రం అందుకుంటున్న రాజేష్

నూజివీడు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం నూజివీడు క్యాంపస్‌లో డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్‌గా రాజేష్ నియమితులయ్యారు. ఆంగ్ల శాఖలో ఒప్పంద అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎల్. రాజేష్‌ను డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ (బాయ్స్)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఎస్. అమరేంద్రకుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఈ బాధ్యతలో రాజేష్ ఒక ఏడాది పాటు కొనసాగుతారు. బాధ్యతలు స్వీకరించిన రాజేష్‌ను సెంట్రల్ డీన్ దువ్వూరి శ్రావణి, సెంట్రల్ ఏవో బండి ప్రసాద్, నూజివీడు క్యాంపస్ పరిపాలనాధికారి బి. లక్ష్మణరావు, డీన్ ఎస్. చిరంజీవి, చీఫ్ వార్డెన్ బి. సురేష్‌బాబు, పూర్వ డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ జాడ సీతాపతిరావు తదితరులు అభినందించారు.

> రెండేళ్ల క్రితం నరసాపురం పట్టణ ప్రాంతంలో ఒక వ్యక్తి బ్యాంకు ఏటీఎంకు వెళ్లి అందులో దొంగనోట్లను జమ చేశాడు. ఆ మిషన్ ఒరిజినల్ నోట్లను మాత్రమే తీసుకుని దొంగనోట్లను పక్కకు గెంటివేసింది. తర్వాత బ్యాంకు అధికారులు వచ్చి మిషన్ ఓపెన్ చేయగానే దొంగనోట్లు కనిపించాయి. సీసీ కెమెరా ఫుటేజీ ద్వారా నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై ఐదుగురిపై కేసు నమోదైనప్పటికీ ఇప్పటి వరకు ఆ కేసు పురోగతి సాధించలేదని సమాచారం.

> భీమవరం పట్టణానికి చెందిన ఒక వ్యక్తి దళారుల మాటలు నమ్మి లక్షకు రూ. 5 లక్షలు ఇస్తామంటే తీసుకున్నాడు. ఆ దొంగనోట్లను ఎలా చెలామణి చేయాలో తెలియక స్నేహితుడు రిజిస్ట్రేషన్ కోసం ఆ సొమ్మును అప్పుగా ఇచ్చాడు. అక్కడ అవతలి వారు నగదు తీసుకుని రెండోరోజు మిషన్‌లో పెట్టగా దొంగనోట్లుగా తేలింది. స్థలం కొనుగోలు చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయట పడడంతో అసలైన నిందితుడిని అరెస్ట్ చేశారు.

> పది రోజుల క్రితం తణుకు పట్టణంలో ఒక వ్యక్తి దొంగనోట్లను మార్చేందుకు ఏటీఎంలో నగదు జమ చేశాడు. ఆ నగదు అతడి అకౌంట్‌కు జమ కాకపోవడంతో బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అధికారులు దర్యాప్తు చేసి దొంగనోట్లను ఆ వ్యక్తే తీసుకువచ్చినట్లుగా గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ కుంభకోణంలో ఏడుగురు వ్యక్తులు ఉన్నట్లుగా నిర్ధారణ అయ్యింది. ప్రస్తుతానికి ఐదుగురిని అరెస్ట్ చేశారని, ఇంకా ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిసింది.

దొంగ నోట్ల దందా

ఉమ్మడి పశ్చిమలో రెచ్చిపోతున్న దొంగనోట్ల ముఠాలు



తణుకులో ఫేక్ కరెన్సీ వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్ (ఫైల్)

- మూడు ముఠాలే కీలకం
- నిఘా పెట్టి పట్టుకుంటున్న పోలీసులు

ఎదుటివారి అత్యాశే.. మోసగాళ్లకు ఒక వరం. ఇది సమాజంలో నిత్యం కనిపిస్తున్న పరిస్థితులు. త్వరితగతిన ఏదో మార్గంలో ఎదిగిపోవాలనే అత్యాశతో కొంతమంది అడుగులు వేస్తూ ఉంటారు. చివరకు తమకు ఉన్న సంపాదనను కూడా తమ అత్యాశ వల్ల పోగొట్టుకునే పరిస్థితులు వస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇటీవల కాలంలో నాలుగైదు దొంగనోట్ల చలామణి ఘటనలు జరిగాయి. కొంతమంది అత్యాశ గల వారిని ఎంపిక చేసుకుని రూ.లక్షకు రూ. నాలుగు లక్షలు దొంగనోట్లు ఇస్తామంటూ వారికి ప్రలోభపెట్టి లొంగదీసుకుంటున్నారు. ఆ తరువాత మోసపోయిన వారు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లాలో దొంగనోట్ల మూడు ముఠాలు ఆరితేరి అత్యాశ ఉన్న వారిని ఎంపిక చేసుకుంటూ ఇట్టే బుట్టలో పడేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసులు అరెస్టు చేసి ఈ ముఠాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నా.. ఏదో ఒక రోజు ఒకేసారి ధనవంతులం కాకపోతామా అంటూ ఇలాంటి మోసగాళ్ల మాటలు నమ్ముతూ సొమ్ములను పోగొట్టుకుంటూ మోసపోయిన ఘటనలు ఉన్నాయి.

అత్యంత త్వరగా ఆకర్షణకు గురయ్యే నకిలీ నోట్లు, నకిలీ బంగారం. జిల్లాలో మట్టి పనులు చేస్తున్నామని, మట్టి తవ్వినప్పుడు ఈ బంగారపు ముక్కలు దొరికాయంటూ నమ్మించి ఆ బంగారపు ముక్కను షాపునకు తీసుకువెళ్లి నాణ్యతను పరీక్షించుకోవచ్చునంటూ ఆ ముక్కలోని చిన్న ముక్కను కట్ చేసి ఇస్తారు. ఈ ముక్క పరీక్షిస్తే నిజమైనదే అవుతుంది. కానీ మిగిలిన ముక్క అంతా ఇత్తడే. పాపం తక్కువ ధరకు ఎక్కువ బంగారం వస్తుందని మోసపోయిన వారు ఎందరో ఉన్నారు.

- ఇటీవల ద్వారకాతిరుమల మండలం టి.లక్ష్మీపురం గ్రామానికి చెందిన కోడూరు రవితేజ కొంతకాలం నుంచి జంగారెడ్డిగూడెంలో ఉంటూ పట్టణంలోని పద్మా థియేటర్ ప్రాంతానికి షేక్‌నాగూర్ మీరావలి, మసీదు సెంటర్‌కు చెందిన వీరంకి రాజేష్‌లతో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు తరచుగా ద్వారకా తిరుమల వెళుతూ అక్కడ హోటల్ నడుపుకుంటున్న కొల్లి వెంకట సుబ్రహ్మణ్యం అలియాస్ సుభాశ్‌తో మాటలు కలుపుతూ ఇక్కడ టూరిస్టులు ఎక్కువగా వస్తున్నారని ఈ నేపథ్యంలో నకిలీ నోట్లు సులువుగా చలామణి అవుతాయని తమ వద్ద రూ.15 లక్షల నకిలీ నోట్లు ఉన్నాయని రెండున్నర లక్షల రూపాయలు అసలు నోట్లు ఇవ్వాలని రవితేజ ముఠా సుభాష్‌కు చెప్పడంతో అత్యాశతో అంగీకరించాడు. మొత్తం మీద ఆ సొమ్ములను మార్చుకునే సమయంలో ద్వారకాతిరుమల పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు.
- మరో ముఠా చింతలపూడి పరిసర ప్రాంతాల్లో ఉంటూ నకిలీ కరెన్సీ తీసుకువచ్చి జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో మోసాలకు పాల్పడడంతో అరెస్టు చేశారు.

దొంగనోట్లు చలామణి ఇలా..

ఇతర రాష్ట్రాల నుంచి అధునాతన పరికరాలను కొనుగోలు చేసుకువచ్చిన దుండగులు వాటిని నిర్మానుష్య ప్రాంతాల్లోని ఇళ్లను అద్దెకు తీసుకుంటారు. వాటిని అందులో ఉంచి కావలసిన పేపర్లు, ఇంకులు వంటివి సేకరించి, రాత్రి సమయాల్లో ప్రింట్ చేస్తూ ఉంటారు. అనంతరం వాటిని ఆరబెట్టి కట్టలుగా బయటకు తీసుకువెళతారు. ఇక అక్కడ నుంచి అమాయకులు ఎవరు దొరుకుతారా అని వల వేస్తారు.

- ఇంకో ముఠా తణుకు ప్రాంతాల్లో ఉంటూ డబ్లింగ్ కరెన్సీ చలామణి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. నోట్ల కట్టలో పైనకింద అసలు నోట్లను పెట్టి మధ్యలో నల్లరంగుతో ఉన్న నోట్లను ఉంచుతారు. ఆ నోట్లను తాము ఇచ్చిన రసాయనంలో తడిపి ఆరబెడితే అసలు నోట్లుగా మారుతుందని చెబుతూ మోసాలకు పాల్పడుతున్నారు. పోలీసులు ఈ బృందాలపై నిఘా ఏర్పాటు చేసి అరెస్టులు చేస్తూనే ఉన్నారు. ఇంకోవైపు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో గుర్తించే విధానం ఉండగా మరోవైపు నేరస్తుల కదలికలపై నిఘా ఉంచుతున్నారు.

అత్యాశకు పోకూడదు



కష్టపడకుండా అక్రమ మార్గంలో సొమ్ములను పొందాలంటే ఇబ్బందులకు గురై నష్టపోక తప్పదు. నకిలీ నోట్ల ముఠాలపై నిఘా ఉంచాం. వారి కదలికలను గుర్తించేందుకు ఫేస్‌రికగ్నైజింగ్ కెమెరాలతో ఎప్పటికప్పుడు గుర్తించి పరిశీలన జరుపుతున్నాం. ప్రజలు ఆశకు పోకూడదు. మోసగాళ్ల సమాచారాన్ని 112కు గాని, జిల్లా పోలీస్ కార్యాలయ వాటా ట్సప్ 95503 51100కు సమాచారమివ్వండి.

కేపీఎస్ కిశోర్, ఎస్పీ, ఏలూరు జిల్లా

దొంగనోట్లు చెలామణి చేస్తే చర్యలు



ఎవరైనా దొంగనోట్లు ఇస్తాం.. అసలైన నోట్లు ఇవ్వండి అంటూ ప్రలోభాలకు గురి చేస్తే వెంటనే పోలీసులను సంప్రదించాలి. కొందరు దళారులు అమాయకులను వలలో వేసుకుని ఒక్కసారిగా కోటీశ్వరులైపోదామన్న ఆలోచనలో నేరాలకు పాల్పడుతున్నారు. నేరాలకు పాల్పడ్డ వారిపై పోలీసు శాఖ ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేసింది. కఠిన శిక్షలు పడతాయి.

- ఆర్‌జీ. జయసూర్య, భీమవరం డీఎస్పీ

కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు కల్పించకపోవడంపై ఫిర్యాదు



డీఈవోకు ఫిర్యాదు అందజేస్తున్న జేఏసీ జిల్లా నాయకులు

ఏలూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యాహక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కుటుంబాల పేదవిద్యార్థులకు అన్ని కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లకు ఉచితంగా ప్రవేశాలు కల్పించాల్సి ఉండగా జిల్లాలోని సంబంధిత కార్పొరేట్ పాఠశాలలు నిరాకరిస్తుండటంపై శుక్రవారం డీఈవో వెంకట లక్ష్మమ్మకు ఏపీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారుల జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏలూరు జడ్పీ మీటింగ్ హాలులో జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ హాలులో డీఈవోను కలుసుకుని ఫిర్యాదు అందజేశారు. జిల్లాలో కార్పొరేట్ పాఠశాలలవారీగా కేటాయించిన సీట్ల వివరాలు, భర్తీచేసిన సీట్ల వివరాలు తెలియజేయాలని కోరారు. ఉచిత ప్రవేశాలకు నిరాకరించడానికిగల కారణాలపై అన్ని మండలాల ఎంఈవోలతో పర్యవేక్షణ చేయించాలని డిమాండ్ చేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ సర్వేశ్వరరావు, సెక్రటరీ జనరల్ కృష్ణ, కోశాధికారి వెంకటేశ్వరరావు, కో-చైర్మన్లు సురేష్‌బాబు, హనుమ, స్టీవెన్, ప్రవీణ్, రమణ, తదితరులున్నారు.

మా పిల్లలకీ పథకాలివ్వండి: అంగన్వాడీలు

ముసునూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు ప్రభుత్వం తక్షణమే సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ముసు నూరు తహసీల్దార్ కేవీ రమణకు శుక్రవారం అంగన్‌వాడీలు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 12 వేలు లోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు, తల్లికి వందనం అమలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అయితే అంగన్‌వాడీ వర్కర్‌కు రూ. 11,500, హెల్పర్, మినీ వర్కర్‌కు రూ. 7 వేలు గౌరవ వేతనంగా ఇస్తున్నారని, అయితే అంగన్‌వాడీలు ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదయ్యారని సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పి.రాజకుమారి, కె.విద్యావతి, సులోచన, రమాదేవి పాల్గొన్నారు.

పీ-4లో భాగంగా ఆర్థిక సాయం


నూజివీడు టౌన్, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పీ-4లో భాగంగా మండల వెంకటరామయ్య తుక్కులూరు గ్రామ పరిధిలోని పేద విద్యార్థులకు రూ. 40 వేలు, వృద్ధాశ్రమంలో వీల్ చైర్స్ కోసం రూ.30 వేలు అందించారు. ఈ సందర్భంగా పీ-4 కోఆర్డినేటర్ బి. సుబ్బారావు మాట్లాడుతూ స్వయంగా సీఎం చంద్రబాబు పేదల అభ్యున్నతికి పిలుపునివ్వడంతో మండవ ఫౌండేషన్ ద్వారా మండల వెంకటరామయ్య వారి తనయులు ప్రభాకర్ రావు ముందుకు వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పేద కుటుంబాలలోని వారు చిరు వ్యాపారులు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు.

క్రైం సమాచారం

చికిత్స పొందుతూ యువతి మృతి


భీమవరం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి.. చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతి చెందినట్టు భీమవరం వన్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రమానం గ్రామానికి చెందిన సంగాని రామలక్ష్మి తన ముగ్గురు పిల్లలతో భీమవరం తన తమ్ముడి ఇంటికి వచ్చారు. గతనెల 28న మొబైల్ ఫోన్ విషయంలో వాగ్వాదం చేసుకోవడంతో పెద్ద కుమార్తె అయిన సంగాని చందనప్రియ(20)ను ఆమె తల్లి మందలించారు. మరుసటి రోజు 29న తెల్లవారుజామున రామలక్ష్మి తమ్ముడు ఇంటి బయట చూడగా ఆ యువతి షెడ్డులో ఇనుపరాడ్డుకు చీరతో ఉరివేసుకుని ఉండడం గమనించారు. వెంటనే ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 12వ తేదీ సాయంత్రం మృతి చెందింది. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

మద్యం మత్తులో ఒకరి మృతి



లక్ష్మీకాంత్ మృతదేహం

కాళ్ళ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కాళ్ల మండలం పెద అమిరం గ్రామ పరిధిలో మద్యం మత్తులో ఒక వ్యక్తి మృతి చెందినట్టు కాళ్ల పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి.. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన ఎన్.లక్ష్మీకాంత్ (34) భీమవరం పట్టణంలోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్నాడు. అతడికి వివాహమై ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసై మారకపోవడంతో సుమారు ఐదేళ్ల క్రితం భార్య, ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మద్యానికి బానిసైన అతడు తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం తాగి సైకిల్‌పై వస్తూ పెద అమిరంలోని లిబర్టీ ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డు పక్కన రాయిపై పడిపోవడంతో కనుబొమ్మ వద్ద గాయమై చనిపోయాడు. శుక్రవారం ఉదయం స్థానికుల సమాచారంతో భీమవరం డీఎస్పీ జయసూర్య, ఆకివీడు సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి మదనాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.



కోమటిగుంటలో పంట కాలువలోకి వెళ్లిన స్కూల్ బస్సు

పంట కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

కాళ్ళ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు తెరిచిన రెండో రోజు శుక్రవారం స్కూల్ బస్సు ప్రమాదానికి గురవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులు చెందుతున్నారు. కాళ్ళ మండలం కోమటిగుంట గ్రామంలో భీమవరం పట్టణంలో ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థకు చెందిన స్కూల్ బస్సు శుక్రవారం ఉదయం ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని విద్యార్థులను స్కూల్‌కి తీసుకువెళ్లడానికి వచ్చిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో అదుపు తప్పి సమీపంలోని పంట కాలువలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో బస్సులో విద్యార్థులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అనుభవజ్ఞులైన డ్రైవర్లను పాఠశాల యాజమాన్యాలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత యాజమాన్యాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇంటిని దోచేశారు

- 15 కాసుల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు అపహరణ



ఇంట్లో వెండి వస్తువులు, చిల్లర నగదును చెల్లాచెదురుగా వేసిన దొంగ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ

ఏలూరు క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : దైవదర్శనం కోసం కుటుంబంతో సహా ఊరు వెళ్లి వచ్చేసరికి దొంగలు ఆ ఇంటిని దోచేశారు. ఏలూరు దక్షిణపువీధికి చెందిన ఇన్నమూరి భాస్కరరావు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లి కలిసి జీవిస్తున్నారు. ఆయన గడియారస్తంభం వద్ద ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్ షాపును నిర్వహిస్తున్నారు. ఈనెల 8న ఇంటికి తాళాలు వేసి కుటుంబం మొత్తం మొక్కుతీర్చుకోవడానికి తిరుపతి వెళ్లి దర్శనాలు పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటి తలుపు గడియ తీసి ఉంది. బీరువాను పగులగొట్టి 15 కాసుల బంగారు ఆభరణాలు, రూ.3 లక్షల నగదు దొంగలు అపహరించుకుపోయారు. వెండి వస్తువులు, చిల్లర నగదును ఇంట్లో మంచంపై చెల్లాచెదురుగా పడవేసి వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ జి.సత్యనారాయణ, ఎస్ఐ మదీనాబాషా వారి సిబ్బంది, క్లూస్ టీమ్, పోలీసు జాగిలం బృందం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. అదేమార్గంలో వెళ్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి దొంగతనం ఘటన తెలుసుకుని వారిని పరామర్శించి కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని, దొంగలను అరెస్టు చేసి సొత్తు రికవరీ చేయాలని పోలీసులకు సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

- రూ.13 లక్షల విలువైన తొమ్మిది బైక్‌ల స్వాధీనం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు గేటు లోపల పార్క్ చేసిన మోటారుసైకిళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడే దొంగను తాడేపల్లిగూడెం పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశామని సీఐ ఆదిప్రసాద్ తెలిపారు. గత కొంతకాలంగా తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో మోటారు సైకిళ్ల చోరీలకు గురవుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఎస్పీ పి.అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ విశ్వనాథ్‌ల ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు కొత్తపేట పంపుల చెరువు సెంటర్‌కు చెందిన పెరుమాళ్ల దానయ్య అనే పూతి ప్రసాద్‌ను పట్టుకుని విచారించారు. పూతి ప్రసాద్ గతంలో పలు చోరీలకు పాల్పడి జైలుశిక్ష అనుభవించిన రికార్డు ఉంది. ఈ క్రమంలో నిందితుడు తాడేపల్లిగూడెం, తణుకు, రావులపాలెం, గుడివాడ తదితర స్టేషన్‌ల పరిధిలో చోరీలకు పాల్పడినట్టు అంగీకరించాడు. ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి రూ.13లక్షలు విలువ చేసే తొమ్మిది మోటారుసైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సీఐ ఆది ప్రసాద్, ఎస్ఐ నాగరాజు, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న కార్యదర్శి రత్నప్రసాద్

వృద్ధులను ఆదుకోవాలి

ఉమ్మడి పశ్చిమ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో 63 శాతం వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు జూన్ 15వ తేదీ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం సందర్భంగా ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక సీనియర్ సిటిజన్ అసోసియేషన్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వృద్ధులు నిరాదరణకు గురవుతున్నారని, ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పోయిన తర్వాత పిల్లలకు తల్లిదండ్రులపై బాధ్యత లేకుండా పోయిందన్నారు. తల్లిదండ్రులు చిన్నానాటి నుంచే కుటుంబ విలువలు, సమాజం పట్ల అవగాహన కల్పించాలని పెద్దల జీవన అనుభవం కుటుంబ పాలనకు ఎంతో ఉపయోగపడుతుందని సూచించారు. నిరాదరణకు గురైన వృద్ధులు వారి పిల్లల నుంచి భరణం పొందే హక్కు ఉందని, గిఫ్టుగా ఇచ్చిన ఆస్తులను అవసరమైన పక్షంలో తిరిగి పొందవచ్చని సూచించారు.కార్యక్రమంలో న్యాయవాది రత్నరాజు, ఏలూరు వయోవృద్ధుల అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్‌వీవీఎస్ ప్రసాదు, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తణుకులో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశానికి తరలి రండి



విలేకరులతో మాట్లాడుతున్న తిరుపతిరావు, తదితరులు

తణుకు, జూన్13(ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ ఈనెల 15న తణుకులో నిర్వహించే అగ్రిగోల్డ్ బాధితుల జిల్లా సమావేశానికి పెద్దఎత్తున తరలి రావాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు కోరారు. శుక్రవారం సీపీఐ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం మోసానికి గురై నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ సహకారంతో పదేళ్లుగా ఉద్య మిస్తున్నామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ ప్రభుత్వం అగ్రి ఆస్తులు స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. సీపీఐ నాయకులు బొద్దాని నాగరాజు, అసోసియేషన్ నాయకులు నాగలక్ష్మి, రామశ్రీను, కొండయ్య, శ్రీనివాసు, పాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

అత్తిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అత్తిలి లయన్స్ క్లబ్, తణుకు ముళ్ళపూడి మెమోరియల్ హాస్పటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 38 మందికి సాధారణ పరీక్షలు, 30 మందికి కంటి పరీక్షలు, ముగ్గురు పిల్లలకు, ఇద్దరు గర్భిణులకు పరీక్షలు చేశారు. ఆరుగురికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ధారించారు. డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మౌనిక, డాక్టర్ సాయిమంజు, డాక్టర్ వైవిఎస్ ప్రసున్న, పీఆర్వో నాగరాజు సేవలు అందించారు. క్లబ్ అధ్యక్షుడు సింగులారిటీ చంద్రశేఖర్, కార్యదర్శి శీతల వెంకట నారాయణ, బండి గంగాధర్ పాల్గొన్నారు

అగ్నిమాపక అధికారి బాధ్యతలు స్వీకరణ



భీమవరం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భీమవరం అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్.సూర్యప్రకాశరావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కె.శ్రీనివాసరావు శుక్రవారం విధుల్లో చేరారు. ఆయన నిడదవోలు అగ్నిమాపక కేంద్రం నుంచి భీమవరం వచ్చారు. సూర్యప్రకాశరావు విజయవాడ -1 అగ్నిమాపక కేంద్రానికి బదిలీపై వెళ్లారు.

బలుసులమ్మకు ఎమ్మెల్యే బొలిశెట్టి పూజలు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ ఆశీస్సులు రాష్ట్ర ప్రజలు అందరిపైనా ఉండాలని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ వచ్చే అమ్మవారి జాతర ఆలయ కమిటి సభ్యులు ఘనంగా నిర్వహించాలన్నారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కన్వినర్ ఈతకోట తాతాజీ, శ్రీరంగం అంజి, నీలం సురేష్, దాట్ల జగన్నాధరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



వినతి పత్రాలు స్వీకరిస్తున్న సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భీమవరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని, పరిష్కారం కానటువంటి సమస్యలను కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరింపజేయాలని టీడీపీ నాయకులకు సూచించారు.

పెద అమిరంలో డ్రై డే

కాళ్ళ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పెద అమిరంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వి.క్రాంతికుమార్, జి.సుభాష్ హాజరై గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే ప్రాధాన్యం గురించి వివరిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తాగునీటి వనరుల గురించి వివరించారు. అనంతరం కొన్ని గృహాలను సందర్శించి నిల్వ నీటిలో ఉన్న దోమ లార్వాను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్. సునీల్, పీహెచ్ఎన్ చండీరాణి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి



పెంటపాడులో టైలరింగ్ శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న టైలరింగ్ ఫెడరేషన్ చైర్మన్ స్వామి

పెంటపాడు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా రాణించాలని రాష్ట్ర టైలరింగ్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చీకట్ల బాలాజీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌జీ కళాశాలకు అవార్డు

పెంటపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఉత్తమ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూ ట్ అవార్డు లభించింది. కళాశాల తరుపున ఎన్‌సీసీ అధికారి విక్టర్ ప్రేమసాగర్ జిల్లా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. తమ కళాశాలకు అవార్డు వచ్చినందుకు గాను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు తదితర అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

పోలీసుల అదుపులో మందుబాబులు

ఆకివీడు/ఉండి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు పట్టణ పరిధిలోని ఖాళీ స్థలంలో మద్యం సేవిస్తున్న ఎనిమిది మంది నుంచి మద్యం స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ హనుమంతు నాగరాజు తెలిపారు. ఉండి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న పది మందిని శుక్రవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఉండి ఎస్సై నసీరుల్లా తెలిపారు.

ఐదేళ్లు దాటితే బదిలీ

(5వ పేజీ తరువాయి)

పరిధిలో సిబ్బంది సేవలందించనున్నారు. ఇప్పటికే ప్రతీ సచివాలయంలో హేతుబద్ధీకరణకు అనుగుణంగా పోస్టింగులు ఖరారు చేశారు. అదే పోస్టింగులు ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగి ఉంటే వేరే చోటకు బదిలీ చేస్తారు. సదరు పోస్టింగ్‌లో ఇతర సచివాలయాల నుంచి బదిలీపై నియమిస్తారు. మరోవైపు ఐదేళ్లు పూర్తి కాకపోయినా ఉద్యోగి అభ్యర్థన మేరకు బదిలీ చేసే అవకాశం ఉంది. జిల్లాలో నాలుగు వేల 200 మంది ఈ సచివాలయాల్లో పనిచేస్తున్నారు. గతంలో కొందరికి బదిలీలపై ఇతర సచివాలయాలకు వెళ్లారు. వారికి ఐదేళ్లు పూర్తి కాలేదు. తాజాగా ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగికి బదిలీ తప్పనిసరి చేశారు. ఈ నిబంధన ఆధారంగా బదిలీకి అర్హత ఉన్న ఉద్యోగుల జాబితాను సిద్ధం చేస్తున్నారు.

వీరికి ప్రాధాన్యం

బదిలీల్లో దృష్టి లోపం, వినికిడి, ఇతర సమస్యలు వున్న దివ్యాంగులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. ఆర్యోగ సమస్యలు వున్న వారికి ఇదే వర్తిస్తుంది. దృష్టి లోపం వున్న ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చారు. సదరు ఉద్యోగి విజ్ఞాపన మేరకు బదిలీ చేయాలని దిశా నిర్దేశం చేసింది. కోరుకున్న చోట ఖాళీ ఉండాలి. ఇలా పలు మార్గదర్శకాలను సూచించింది. దీనికి అనుగుణంగానే బదిలీలు చేయాల్సి ఉంది. ఈ బదిలీలు మునిసిపాల్టీలు వారీగానా, లేదా జిల్లా ప్రాతిపదికన అనేదానిపై స్పష్టత రావాల్సి వుంది. గ్రామ సచివాలయాల్లోను ఇదే గందరగోళం ఉంది.

వేటకు సంద్రం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం నిషేధం విధింది. గతంలో ఈ నిషేధ కాలంలో మత్స్యకారులకు కేవలం రూ.10 వేలు మాత్రమే భృతి అందేది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా దీనిని రూ.20 వేలకు పెంచింది. గతంలో మాదిరి కాకుండా నిషేధ ఉత్తర్వులు అమల్లోకి వచ్చిన 15 రోజుల్లోనే అర్హులైన 1,802 మంది ఖాతాల్లో సొమ్మును జమ చేశారు. ఈ రెండు నెలల కాలంలో వేట లేకపోవడంతో మత్స్యకారులు ఈ భృతితోనే కాలం గడిపారు. కొందరు వలలు, బోట్లను బాగు చేసుకుంటే.. మరికొందరు పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకున్నారు.

అమ్మకు అండగా

5వ పేజీ తరువాయి

ఇచ్చేందుకు సిద్ధం కాలేకపోయారు. 'తల్లికి వందనం' పథకం సొమ్ములు తల్లుల బ్యాంకు ఖాతాల్లో శుక్రవా రం నుంచి జమ చేస్తుండడంతో ఆనందం నెలకొంది. ఒక కుటుంబంలో ఒకరు ఉంటే రూ.13 వేలు, ఇద్దరు వుంటే రూ.26 వేలు, ముగ్గురు ఉంటే రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు చొప్పున తల్లుల ఖాతాల్లో పడుతున్నాయి. పెద్ద మొత్తంలో సొమ్ములు జమ అవుతుండడంతో విద్యార్థుల్లోనూ, తల్లిదండ్రుల్లోను ఆనందానికి అవధులు లేవు. గత ప్రభుత్వ హయాం లో అమ్మ ఒడి కోసం తల్లిదండ్రుల నుంచి ఆధార్, బ్యాంకు ఖాతాల నమోదు వంటి వివరాలను విద్యాసంస్థల్లో సేకరించేవారు. ఈసారి అటువంటి సమాచార సేకరణ లేకపోవడంతో తల్లికి వందనంపై తల్లిదండ్రులు ఒకింత అయోమయానికి లోనయ్యారు. ప్రభుత్వం మాత్రం వార్డు, గ్రామ సచివాలయ సిబ్బందితో ఇటీవల జియోట్యాగింగ్ నిర్వహించింది. తల్లిదండ్రులు, విద్యార్థుల వివరాలను పొందుపరిచింది. ఆ సమాచారం ఆధారంగానే ప్రభుత్వం అర్హుల జాబితాను నిర్ధారించింది. అర్హుల జాబితాను ప్రకటించింది. తదనుగుణంగా తల్లుల ఖాతాలో సొమ్ములు జమ అవుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో 1,76,574 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తిస్తే శుక్రవారం 30 శాతం మందికి అంటే 51 వేల మంది విద్యార్థుల తల్లుల ఖాతాలో సొమ్ములు జమ అయ్యాయి. చాలా కుటుంబాలు ప్రభుత్వానికి కృతజ్ఞతగా పాలాభిషేకాలు నిర్వహిస్తున్నారు.







తణుకులో రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి.. మార్టేరులో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని.. తాడేపల్లిగూడెంలో విద్యార్థికి ఎమ్మెల్యే బొలిశెట్టి సాయం

ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు

తణుకు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. శుక్రవారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రక్తనిధి ఏర్పాటులో భాగంగా రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాలు నుంచి వచ్చిన రోగులకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం వచ్చినపుడు రక్తనిధి కేంద్రం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా గర్భిణులకు రక్తం అవసరం ఉన్నపుడు ఏలూరు నుంచి తీసుకురావాల్సి వస్తుందన్నారు. ఇలాంటి ఇబ్బందులు అధిగమించడానికి ఆసుపత్రి ఆవరణలోనే రక్త నిధి కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, వైద్యులు డాక్టర్ సాయి బాలాజీ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అరాచకం

పెనుమంట్ర: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం, విధ్వంసాల పాలన సాగిందని, ప్రజలు జగన్ రెడ్డిని ఇంటికి పంపించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మార్టేరు గ్రామంలో పల్లె పల్లెకు మన పితాని- సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే బొలిశెట్టి సాయం

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పెంటపాడు మండలం అలంపురం గ్రామానికి చెందిన శ్రవణం మధులత ఇంటర్మీడియట్‌లో 973 మార్కులు సాధించింది. అయితే పేదరికం ఈ విద్యార్థిని చదువుకు అటకంగా మారింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి పెదతాడేపల్లి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినికి ఇష్టమైన ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్స్ టెక్నాలజీ కోర్సులో యాజమాన్యంతో మాట్లాడి చేర్పించారు. ఫీజు రూపేణే తన సొంత నిధులు రూ.25 వేలు అందజేశారు.

ఆక్రమణల తొలగింపునకు కార్యాచరణ: జేసీ

భీమవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కాలువలు, చెరువులు, గట్లు ఆక్రమణలను గుర్తించి తొలగించుటకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం జేసీ చాంబర్‌లో వాచ్‌డాగ్ కమిటీ సభ్యులు, రెవెన్యూ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఫ్యాక్టరీలు, చిన్నతరహా పరిశ్రమలు, వాణిజ్య వ్యాపారాలు, సెప్టిక్ ట్యాంకులు వల్ల మంచి నీటి కాలువలు, చెరువులు కలుషితమమయ్యే ప్రదేశాలను గుర్తించి తొలగించాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు జిల్లాలో 6,892 ఆక్రమణలకుగాను రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలకు సంబంధించిన 350.38 ఎకరాలు ఆక్రమణలను గుర్తించడం జరిగిందన్నారు. జూలై నెల నుంచి 3 నెలల కాలంలో జిల్లాలో ఆక్రమణలన్నీ తొలగించే చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యాచరణకు సంబంధించి ప్రతినెలా 4వ శనివారం సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

టౌన్‌హాల్‌లో యోగాంధ్ర



భీమవరం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : యోగాంధ్ర మాసోత్సవాలలో భాగంగా ది భీమవరం ఎల్‌హెచ్ టౌన్ హాల్‌లో శుక్రవారం యోగాంధ్ర నిర్వహించారు. వంద మందికి పైగా యోగ సాధకులు విచ్చేశారు. టౌన్ హాల్ అధ్యక్షుడు కోళ్ల అబ్బులు యోగ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు. టౌన్ హాల్ ప్రధాన కార్యదర్శి గ్రంధి సురేష్, కార్యదర్శి బేతు కృష్ణారావు, సంయుక్త కార్యదర్శి మేళం శ్రీధర ప్రభాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గ్రంధి వెంకట రావు, యోగా ఇన్‌చార్జి ఎన్.మహేష్ ఏర్పాట్లను పర్యవేక్షిం చారు.

దర్జీలకు సత్కారం

భీమవరంటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : దర్జీ వృత్తి (టైలరింగ్) అంటే ఆనాటి రోజుల్లో ఒక వెలుగు వెలిగిందని, ప్రస్తుతం రెడీమేడ్ వస్త్రాల వ్యవస్థ రావడంతో దర్జీ వృత్తి క్రమేణా మసక బారుతు వస్తోందని భీమవరం పట్టణ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె రామకోటేశ్వరరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ కుట్టు యంత్రం దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు కుట్టుమిషన్ వృత్తిదారులను సత్కరించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శివకవి సాంబ మూర్తి, కార్యదర్శి కాపా త్రినాధ్, కోశాధికారి పి కళ్యాణ్, నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి మాట్లాడు తూ ఆధునిక యుగంలో కుట్టు మెషిన్ లేని జీవితం ఊహించ లేమని, మొదట్లో కుట్టు పని అంతా చేతితోనే జరిగేదన్నారు. ఐజాక్ మెరిట్ సింగర్ కుట్టు మెషిన్ రూపకర్త అని అన్నారు. సహాయ కార్యదర్శి వి సత్యనారాయణ, కారుమూరి బాలచంద్ర కుమార్, మల్లిఖార్జున రావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

తణుకు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాల్గవ వార్డుకు చెందిన జక్కంశెట్టి నాగమణి క్యాన్సర్ వ్యాధితో పడుతున్నది. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ రూ.10 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.

మోకాళ్లపై కూర్చొని నిరసన

నరసాపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. మునిసిపల్ కార్యాలయం గేట్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పెండింగ్ సమస్యలు, కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారులకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి

నరసాపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాల వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడించి అర్హులైన మత్స్యకారులందరికీ వాటిని వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు కోరారు. శుక్రవారం అమరావతిలో కమిషనర్ ఆర్.వీ రామశంకర్ నాయక్‌ను కలిసి తీర ప్రాంతంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించారు.

నేడు లక్ష్మణేశ్వరంలో ఏరువాక

నరసాపురం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో శనివారం ఏరువాక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ డాక్టర్ అనిల్‌కుమారి తెలిపారు. ఏరువాకలో రైతులకు రాయితీలపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు అందిస్తామన్నారు. దీనికి విప్ నాయకర్, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. ఉదయం 10గంటలకు రైతు సేవా కేంద్రం వద్ద కార్యక్రమం జరుగుతుందన్నారు.

సివిల్ సప్లయిస్ డీఎం బదిలీ

భీమవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ శివరామప్రసాద్ కృష్ణా జిల్లాకు బదిలీ అయ్యారు. పశ్చిమకు టెక్నికల్ అసిస్టెంట్ మేనేజర్‌ను ఇన్‌ఛార్జ్‌గా నియమించింది. జిల్లా మేనేజర్‌గా పనిచేస్తున్న శివరామప్రసాద్ వరుసగా వరుసగా ఆరు పర్యాయాలు ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఎక్కడ సమస్యలు ఉంటే అక్కడకు శివరామప్రసాద్‌ను బదిలీ చేస్తారంటూ అధికారుల్లో అభిప్రాయం ఉంది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర జిల్లాల మంత్రులు శివరామప్రసాద్‌ను తమ జిల్లాకు తీసుకువెళ్లడానికి ప్రయత్నాలు చేశారు. దీనితో శివరామప్రసాద్ బదిలీ కాక తప్పలేదు.

ప్రశాంతంగా మెగా డీఎస్సీ పరీక్షలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల నియామకం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ పరీక్షలు తాడేపల్లిగూడెం మండలం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. పరీక్షలకు 308 మంది విద్యార్థులకు గాను 299 మంది హాజరైనట్టు ప్రిన్సిపాల్ రత్నాకరరావు తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నరసాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తే ప్రాణం పోసినట్లు అవుతుందని 7వ ఆంధ్రా నేవెల్ ఎగ్జిక్యూటివ్ లెఫ్ట్‌నెంట్ కమాండర్ సంజిత్‌రౌత్రే అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన డోనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నరసాపురం ఎన్‌సీసీ యూనిట్‌లో ఏర్పాటు చేసిన రక్తదాని శిబిరాన్ని ఆయన గ్రూప్ కమాండర్ రోహిత్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం వీరిద్దరూ రక్తదానం చేశారు. వీరితో పాటు మరో 30 మంది ఎన్‌సీసీ నేవి క్యాడెట్లు రక్తం దానం చేశారు. రెడ్‌క్రాస్ యూనిట్ వీరి రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో యూనిట్ అధికారి రాము, మురళీ కృష్ణ, సతీష్, డాక్టర్ పేర్రాజు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవా సమితి చీరల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం ఎల్ అగ్రహారంలో ఎన్టీయార్ సేవా సమితి ఆధర్యంలో పది మంది మహిళలకు చీరల పంపిణీ చేశారు. సేవా సంస్థ అధ్యక్షుడు పఠాన్ వల్లి, టీడీపీ నాయకులు వాడపల్లి వెంకట సుబ్బరాజు, సబ్నీవీసు కృష్ణమోహన్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లల్ని చదివించకుండా భిక్షాటనకు పంపిస్తే తల్లిదండ్రులపై క్రిమినల్ చర్యలు తప్పవని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ప్రొటక్షన్ అధికారి బెతపూడి నెహమ్యా హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం పోలీసులతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జగ్గన్నపేటకు చెందిన 10 మంది భిక్షాటన చేసే పిల్లల్ని గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం జగ్గన్నపేట సచివాలయ సంరక్షణ కార్యదర్శి శైలజకు అప్పగించి పిల్లలు బడికి పంపించే బాధ్యత అప్పగించారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి డాక్టర్ తీగల రాక

పెంటపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 15వ తేదీ ఆదివారం విజయవాడ నుంచి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేశ్ వస్తున్నారని ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. తల, మెదడు, నరాలు తదితర వాటికి ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని పెదకృష్ణంరాజు తెలిపారు.

ఏడాది పాలనలో అంతా అభివృద్ధే

నరసాపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ముగియడంతో పట్టణ, మండల టీడీపీ నాయకులు సంబరాలు చేస్తున్నారు. సెంటర్లలో భారీ కేక్‌లు కట్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో మాజీ ఏఎంసీ చైర్మన్ కొప్పాడ రవి, జక్కం శ్రీమన్నారాయణ, కొలిచెన పద్మ, మండలంలో మండల అధ్యక్షులు వాతాడి ఉమాల ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేశారు. ఈ ఏడాదిలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నేరవేర్చి చూపించిందన్నారు.

ఆచంట ఎంపీడీవోగా కృష్ణకుమార్

ఆచంట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఆచంట ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన బీఎస్ఎస్ కృష్ణకుమార్‌కు కార్యాలయ సిబ్బందితోపాటు మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కృష్ణ కుమార్ అల్లవరం ఎంపీడీవోగా పని చేస్తూ ఆచంట ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు.

ఉత్తమ రైతు చందుకు సత్కారం

నరసాపురం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):మొగల్తూరు మండలం రామన్నపాలెంకు చెందిన అయితంధాన్ చందుకు శుక్రవారం చిరు సత్కారం లభించింది. మండలంలోని కొప్పర్రు గ్రామంలో జనసేన సీనియర్ నాయకులు పోలిశెట్టి శ్రీనువాస్ అధ్వర్యంలో చందును రైతులతో కలిసి సత్కరించారు. ఇటీవల చందు 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఉత్తమ రైతుగా గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి అందుకున్నారు.



మాధురిని సత్కరిస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు

మాధురికి అభినందన

తణుకు రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దువ్వ గ్రామానికి చెందిన విద్యార్థిని గిద్దా ఆర్తి మాధురి ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష 2025లో రాష్ట్ర స్థాయిలో 1 ర్యాంక్ సాధించి కాకినాడ మోడల్ స్కూల్లో ప్రవేశం పొందిన సందర్భంగా గ్రామస్థులు, పాఠశాల సిబ్బంది అభినందించారు. దువ్వలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదివి మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు హాజరైన మాధురి ఆ పరీక్షల్లో స్టేట్ 1 ర్యాంక్ సాధించిన 6వ తరగతిలో మోడల్ స్కూల్లో ప్రవేశం పొందారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చిక్కాల వేణు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు శ్రీరాముల చిన్ని పాల్గొన్నారు.

విద్యార్థులకు కిట్లు పంపిణీ

మొగల్తూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది విద్యా సంవత్సరానికి సంబంధించి మండలంలోని 82 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేసినట్టు ఎంఈవో శ్యామ్యూల్ జాన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 4516 బ్యాగ్‌లు, 2958 బెల్ట్‌లు, 30,670 నోట్ పుస్తకాలు, షూలు 4328, ఏకీకృత దుస్తులు 4516, డిక్షనరీలు 527 ప్రభుత్వం నుంచి సరఫరా కాగా ఆయా పాఠశాలలకు అందించామన్నారు.

తల్లికి వందనంలో కోత విధించడం సిగ్గుచేటు

భీమవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నేడు పాఠశాల అభివృద్ధి పేరుతో రూ. 2వేలు కోత పెట్టడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శించారు. జిల్లా అధ్యక్షులు బిగ జేష్ నాయకత్వంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ అనేక నిబంధనలు వల్ల పిల్లలందరికీ తల్లికి వందనం పథకం వర్తించలేదని పేర్కొన్నారు. పైగా ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇవ్వకుండా రెండు వేల రూపాయలు కోత విధించడం సిగ్గుచేటన్నారు.

సమాజ సేవలో ఎస్‌బీఐ ముందంజ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్ బ్యాంకు ఖాతాదారుల సేవతోపాటు సమాజ సేవలో ముందు ఉందని రీజనల్ మేనేజర్ రమేష్ నాయుడు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో స్టేట్ బ్యాంకు దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 32 మంది రక్తదానం చేశారు. చీఫ్ మేనేజర్ ఎన్ ప్రకాష్, ఏపీటీబీ ఈఎఫ్ కార్యదర్శి సూర్యనారాయణ, యుఎఫ్‌బీయు కన్వీనర్ ఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

పీఎల్‌కే స్కూల్ కరస్పాండెంట్‌గా చిట్టిబాబు

పాలకొల్లు, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక 21వ వార్డులోని పీఎల్‌కే ప్రాథమి, ప్రాథమికోన్నత పాఠశాల కరస్పాండెంట్‌గా బి. చిట్టిబాబు నియమితులయ్యారు. లాజరస్ మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎల్‌కే విద్యాసంస్థలకు (ఎయిడెడ్) కరస్పాండెంట్‌గా చిట్టిబాబును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చి నట్టు చిట్టిబాబు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా చిట్టిబాబును జిల్లా పాఠశాల విద్యాశాధికారి ఈవీబీ ఎన్ నారాయణ అభినందించారు.

కనక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పాలకొల్లు అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : స్థానిక యడ్లబజారులోని కనక దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి భక్తులు, మహిళలు ప్రత్యేక కుంకుమ పూజలు జరిపించుకున్నారు. పలురువు వాహనపూజలు చేయించుకున్నారు. భక్తుల ఆర్థిక సహాయంతో 800 మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

మెరిట్ స్కాలర్ షిప్‌కు ఆరుగురు విద్యార్థుల అర్హత

పాలకొల్లు అర్బన్, టౌన్ 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ హైస్కూల్స్‌లో 8వ తరగతి చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంకయ్యారు. ఏపీఎస్ఎన్ఎం హైస్కూల్ విద్యార్థులు జి.మనస్వీక్, ఆర్.దేవకీ నంద కిషోర్, వి.సురేఖ లక్ష్మీ, బిఆర్ఎంవిఎం హైస్కూల్ విద్యార్థి వి.వినయ్ నాగ సాయి, గరల్స్ హైస్కూల్ విద్యార్థినీలు ఎస్.జోష్నావి, బి.చరిత ఎన్ఎంఎంఎస్‌కు ఎంపిక అయ్యారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్) నిర్వహించే పరీక్షలు గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించడం జరిగిందని, ఈ ఆరుగురు విద్యార్థులు తన వద్ద ప్రైవేటు చదివారని కెఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె రమేష్‌బాబు విలేకర్లకు తెలిపారు. ఎంపికైన వారికి స్కాలర్‌షిప్‌ను కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు.

రేపు ప్రమాణ స్వీకారం

ఆకివీడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఈ నెల 15న స్థానిక వి కన్వెన్షన్‌లో ప్రమాణస్వీకారం చేస్తారని గొంట్లా కృష్ణమూర్తి శుక్రవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు.

డీఎస్‌వో బదిలీ

ఏలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పౌరసరఫరాల అధికారి టి.శివరాంప్రసాద్ కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పశ్చిమ కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఇబ్రహీంను ఇన్‌చార్జి డీఎస్‌వోగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.



సంకు మురళీకృష్ణను అభినందిస్తున్న ఫెడరేషన్ కార్యదర్శి నందమూరి

జిల్లా సహకార అధికారిగా మురళీకృష్ణ బాధ్యతలు స్వీకరణ

భీమవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సంకు మురళీకృష్ణకు రాష్ట్ర సహకార సంఘ ఉద్యోగుల ఫెడరేషన్ కార్యదర్శి వీఎస్ నందమూరి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి బదిలీపై పశ్చిమ గోదావరి జిల్లా సహకార అధికారిగా బాధ్యతలు చేపట్టిన సంకు మురళీకృష్ణను కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భీమవరం శ్రీహరిపురం లేఅవుట్‌లో ప్రభుత్వ ఉద్యోగుల సహకార గృహనిర్మాణంలో చోటు చేసుకున్న అవకతవకలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఈ లే అవుట్‌లో కొంత మంది పూర్తిగా డబ్బులు చెల్లించినా కూడా రిజిస్ట్రేషన్ జరగలేదు. ఈ విషయంలో డబ్బు చెల్లించిన వారు చాలా ఆందోళన చెందుతున్నారు. ఈ సంఘంలో జరిగిన అవకతవకలను విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

నేడు, రేపు నరసాపురంలో విద్యుత్‌కు అంతరాయం

నరసాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా శని, ఆదివారాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ మధుకుమార్ చెప్పారు. నరసాపురం, మండలం, పాలకొల్లు, మండలం, మొగల్తూరు, అచంట, పెనుగొండ, పోడూరు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు భీమవరంలో..

భీమవరం రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తోకతిప్ప, బర్రెవానిపేట, గరివిడిదిబ్బ, లోసరి, దెయ్యాలతిప్ప, నాగేంద్రపురం గ్రామాలతోపాటు ఆక్వా చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఇఇ) ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

వృద్ధుల పోస్టు కార్డు ఉద్యమం

భీమవరం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : కరోనాకు ముందు సీనియర్ సిటిజన్స్‌కు ఉన్న రాయితీలను రద్దు చేశారని, వాటిని పునరుద్దించాలని కోరుతూ ఆలిండియా సీనియర్ సిటిజన్స్ కాన్ఫెడరేషన్ ఆదేశాలమేరకు పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో పోస్టు కార్డు ఉద్యమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీకి చేరేలా 500 ఉత్తరాలను పోస్టు చేశారు.